## క్లుప్తంగా

### 4న ఎం.కోడూరు మోదమాంబ పండగ

మాడుగుల రూరల్: మండలంలో ఎం.కోడూరు మోదమాంబ అమ్మవారి పండగ వచ్చే నెల 4న ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు, సర్పంచ్ గొల్లవిల్లి నంజీవిరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 3న తొలేలు జాతర, సాయంత్రం నుంచి ఏలేసుగులు ఊరేగింపు, 101 డప్పులు, 101 కాగడాలతో బాణసంచా వెలుగుల మధ్య ఊరేగింపు జరుగుతుందన్నారు. 4వ తేదీ ఉదయం నుంచి అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు.

### సంపద కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



డ్రైనేజీని పరిశీలించి, సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి

మాకవరపాలెం: చెత్త సంపద కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని ఎంపీడీవో సీతామహాలక్ష్మి సూచించారు. మండలంలోని కె.తూటిపాలలో ఉపాధి హామీ పథకంలో నిర్మించిన డ్రైనేజీలతో పాటు చెత్త సంపద కేంద్రాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. ప్రజలంతా చెత్తను ఎక్కడికక్కడ వేయొద్దన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. మిగిలి ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు.

### 8 లక్షల పని దినాల కల్పనే లక్ష్యం



ఏపీవో దాసరి కొండాజీ

నాతవరం: ఉపాధి హామీ పథకంలో ఈ ఏడాది 8 లక్షలు పని దినాలు కల్పించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీవో దాసరి కొండాజీ తెలిపారు. ఇటీవల నాతవరం మండలం ఏపీవోగా బాధ్యతలు చేపట్టిన ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోనే అత్యధికంగా ఉపాధి కూలీలు నాతవరం మండలంలోనే పని చేస్తున్నారన్నారు. ఈ ఏడాది ఉపాధి హామీ పనులకు మండలానికి రూ.40 కోట్లు బడ్జెట్ కేటాయించారన్నారు. అందులో రూ.16 కోట్లు మెటీరియల్ రూపంలో, మిగతావి వేతనదారులకు పని కల్పిస్తామన్నారు. 125 ఎకరాల్లో పండ్ల తోటలు పెంపకం చేపడతామన్నారు. మండల వ్యాప్తంగా 425 ఫారం పాండ్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. అమృత్ సరోవర్ పథకంలో చెరువులు అభివృద్ధి చేస్తామన్నారు.

### ఏజెంట్ల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

చోడవరం: ఎల్ఐసీ ఏజెంట్లు అంతా ఐక్యంగా ఉంటేనే సమస్యల పరిష్కారం సాధ్యమని ఎల్ఐసీ ఏవోఐ(సీఐటీయూ) డివిజన్ అధ్యక్షుడు ఎం.నాగరాజు అన్నారు. చోడవరం ఎల్ఐసీ బ్రాంచి కార్యాలయం ఆవరణలో ఏజెంట్ల కార్యవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. ఏజెంట్లు, బ్రాంచి అధికారులు సమన్వయంతో పని చేసుకోవాలని ఆయన సూచించారు. పాలసీదారులకు మెరుగైన సేవలు అందించడానికి ఏజెంట్లు, అధికారులు కృషిచేయాలన్నారు. కార్పొరేషన్లలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఏజెంట్లు మారాలని డివిజన్ కార్యదర్శి రవీంద్రనాథ్ ఠాగూర్ సూచించారు. ఈ సమావేశంలో కోశాధికారి త్రిమూర్తులు, మజ్జి శంకర్రావు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

### మన జిల్లా టమాటాలనే కొనాలి



జిల్లా ఉద్యానవన శాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం జిల్లా కోశాధికారి

అనకాపల్లి: ఇటీవల విశాఖపట్నం అగ్రికల్చర్ అధికారులు చిత్తూరు నుంచి వచ్చే టమాటాలు అమ్ముతున్నారని, అనకాపల్లి జిల్లాలో పండించిన టమాటాలను విశాఖ జిల్లాలో అమ్మకాలు సాగించే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా రైతు సంఘం కోశాధికారి గండి నాయనబాబు కోరారు. స్థానిక జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్‌కు తమ కార్యాలయంలో శుక్రవారం వినతపత్రం అందజేశారు. నాయనబాబు మాట్లాడుతూ మండలంలో సిరసపల్లి, వల్లూరు, గొర్లివానిపాలెం, గవర్ల అనకాపల్లి, అసకపల్లి, తదితర గ్రామాల నుంచి రైతులు టమాటాలు పండించి రోజుకు 30 టన్నులు విశాఖపట్నం రైతు బజార్లుకు, ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లి గత అనేక సంవత్సరాలుగా విక్రయిస్తున్నారన్నారు. మండలం పరిసర గ్రామాల రైతుల పండించిన కూరగాయలు, టమాటా పంటలకు గిట్టుబాటు ధరలు కలిగించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకుడు కె.తేల్లయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

---

వేసవి తాపం..

# తాటిముంజలతో ఉపశమనం



- జోరుగా సాగుతున్న విక్రయాలు
- ఆసక్తిగా కొనుగోలు చేస్తున్న ప్రజలు
- చిరు వ్యాపారులకు చక్కని ఉపాధి



విక్రయానికి ఉంచిన పుచ్చకాయలు



మాడుగులలో విక్రయిస్తున్న తాటిముంజలు

మాడుగుల రూరల్: మండుటెండల్లో తీక్షణమే శరీరానికి చల్లదనం ప్రసాదించే తాటి ముంజల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రతి ఏటా వేసవిలో ఇవి విరివిగా పండుతాయి. ధర తక్కువగా ఉండడం, రుచితో పాటు చల్లదనం, ఆరోగ్యానికి మేలు చేస్తుండడంతో వీటిని కొనుగోలు చేసేందుకు అంతా ఆసక్తి చూపుతున్నారు. కొబ్బరి మాదిరిగానే తాటి ముంజలు కూడా మానవాళికి ఎంతో మేలు చేస్తాయి. తాటిచెట్లకు ప్రత్యేకించి తోటలంటూ ఏమీ ఉండవు. పొలాల గట్లపైన, ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే ఇవి పెరుగుతాయి. పేద, చిరు విక్రయదారులకు అంతో ఇంతో ఉపాధి అందిస్తున్నాయి తాటి ముంజలు. తాటి చెట్ల నుంచి తాటి ముంజులు సేకరించి, వాటిని నగరంలోని పలు ప్రధాన రహదారుల వద్ద విక్రయిస్తున్నారు. వేసవిలో వీటికి డిమాండ్ అధికంగా ఉండడంతో హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయి. ఇవి డజన్ రూ.40 నుంచి రూ.50కి విక్రయిస్తున్నారు. మాడుగుల, కె.జె.పురం, సాగరం, ఘాట్ రోడ్డు, కింతలి, తదితర గ్రామాల్లో తాటి ముంజలను విక్రయిస్తున్నారు.

**చురుగ్గా పుచ్చకాయల విక్రయాలు**

పుచ్చకాయల విక్రయాలు కూడా చురుగ్గా సాగుతున్నాయి. బుచ్చెయ్యపేట మండలంలో పలు గ్రామాల్లో పండించే పుచ్చకాయలను ఆటోల్లో తిరుగుతూ విక్రయిస్తున్నారు. పుచ్చకాయల సైజ్‌ను బట్టి చిన్నదైతే రూ.30, పెద్దదైతే రూ.50కు అమ్ముతున్నారు. ఘాట్‌రోడ్డు, మాడుగుల, కె.జె.పురం, తదితర చోట్ల కాయలు కోసి పుచ్చకాయ ముక్కలు విక్రయిస్తున్నారు. ఒక ముక్క రూ.5కు అమ్ముతున్నారు. ఎండలో ప్రయాణాలు సాగించే వారు ఉష్ణతాపం నుంచి ఉపశమనం కోసం విరివిగా కొంటున్నారు.

**కొబ్బరి బొండాలు**

వేసవి తాపం నుంచి జనం కొబ్బరి బొండాలను సైతం ఆశ్రయిస్తున్నారు. సైజును బట్టి కొబ్బరి బొండా ఖరీదు రూ.20 నుంచి రూ.30 వరకు విక్రయిస్తున్నారు. ముకుందపురం, కోటపాడు, మాడుగుల, తదితర ప్రధాన కూడళ్లలో కొబ్బరి బొండాల విక్రయం జోరుగా సాగుతోంది.

### వేసవిలో దొరికే తాటి ముంజలు తప్పక తినాలి



వేసవిలో మాత్రమే ప్రకృతి సిద్ధంగా దొరికే తాటి ముంజలు తప్పక తినాలి. వీటితో ఎంతో ప్రయోజనం ఉంటుంది. వేసవి ఉష్ణోగ్రత నుంచి ఉపశమనం పొందవచ్చు. పుచ్చకాయలు, కొబ్బరి నీళ్లు కూడా వేసవిలో తరచూ తీసుకోవాలి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మంచివి. మట్టి కుండలో నీరు తాగడం ఉత్తమం.

– కె.లీలాప్రసాద్, వైద్యాధికారి, కె.జె.పురం పీహెచ్‌సీ, మాడుగుల మండలం

## ప్రకృతి సాగుతో రసాయన రహిత పంటలు



విత్తనాల కిట్లను రైతులకు అందజేస్తున్న అధికారులు

మాకవరపాలెం: ప్రకృతి సాగుతో రసాయన రహిత పంటలను పొందొచ్చని ఏవో చిరంజీవి అన్నారు. మండలంలోని నారాయణరాజుపేటను ఇటీవల ప్రకృతి సేద్యంలో భాగంగా రసాయన రహిత పంటల సాగుకు ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో ఈ గ్రామంతో పాటు మరికొన్ని గ్రామాల్లో రైతులకు ఈ ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన నవధాన్యాల విత్తన కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రకృతి సేద్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక రాయితీలను అందిస్తున్నాయన్నారు. రసాయన రహిత సాగును ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నవధాన్యాల విత్తనాల కిట్లను పంపిణీ చేసినట్టు చెప్పారు. రైతులు ఆ దిశగా సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పీలా వరలక్ష్మి, మాజీ సర్పంచ్ గిరి, ఏపీఎం మంగ, ఏపీవో కాశీ, ప్రకృతి సేద్య సిబ్బంది కవిత, పాల్గొన్నారు.

## అవంతిలో నేడు ఇండస్ట్రీ కనెక్ట్

మాకవరపాలెం: ఉద్యోగ అవకాశాలపై ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇండస్ట్రీ కనెక్ట్ నిర్వహిస్తున్నామని అవంతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ రావు శుక్రవారం తెలిపారు. కళాశాలలో శనివారం ఉదయం 9 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. సాంకేతికపరంగా మారుతున్న నైపుణ్య అవసరాలు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, తదితర అంశాలపై ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తారన్నారు.

## రైతులకు సాయిల్ హెల్త్ కార్డు తప్పనిసరి



మట్టి నమూనా సేకరణపై రైతులకు వివరిస్తున్న ఏవో వాసుదేవరావు

మాడుగుల: సాయిల్ హెల్త్ కార్డును ప్రతి రైతు తీసుకోవాలని వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు అన్నారు. శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిక దిగుబడులు రావాలంటే భూసారా పరీక్షలు చేయించుకోవాలన్నారు. సన్న, చిన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీ రైతులు తమ పొలాల్లో మట్టిని సేకరించి అనకాపల్లి పంపించి సాయిల్ హెల్త్ కార్డు తీసుకోవాలన్నారు. ఈ కార్డులపై ఎరువులు ఏయే మోతాదులో వాడుకోవాలో, తదితర సూచనలు ఉంటాయన్నారు.

## ఉగ్రవాదుల దాడి అమానుషం



చీమలపాడులో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న చిన్నారులు, తదితరులు



చీడికాడ సెంటర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు



చోడవరంలో ర్యాలీ చేస్తున్న ప్రజలు

రావికమతం: కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి చంపడం అమానుషమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు అన్నారు. ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ చీమలపాడు పంచాయతీ అజేయపురం, కళ్యాణపులోవ గ్రామాల్లో శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. మృతులకు నివాళులర్పించారు. పార్టీ నాయకులు పాంగి విజయ్, చిన్నారులు పాల్గొన్నారు.

నాతవరం: కశ్మీర్‌లో ఉగ్రవాదులు దాడికి నిరసనగా రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టరు రాజాన సూర్యచంద్ర ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. చెర్లోపాలెం పంచాయతీలో ర్యాలీ అనంతరం మానవహారం చేపట్టారు. మారణహోమానికి పాల్పడిన ఉగ్రవాదులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

చీడికాడ: అమాయకులైన టూరిస్టులను పొట్టన పెట్టుకున్న తీవ్రవాదుల అంతం చూడాలని ఎంఆర్‌పీఎస్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి మూహూర్త శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శుక్రవారం చీడికాడలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఎస్సీ కాలనీ నుంచి చీడికాడ సెంటర్ వరకు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం సెంటర్‌లో మానవహారం నిర్వహించి తీవ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఏలుసూరి ఘాటీలు, గొట్టిపాటి సామ్రాట్ కుమార్, రావాడ దేవుడు, రావాడ రాము, తదితరులు పాల్గొన్నారు.

చోడవరం: ఉగ్రవాదులు దాడులు పాక్ దుశ్చర్యే అని నినాదాలు చేస్తూ చోడవరం అన్ని వర్గాల ప్రజలు నిరసన ర్యాలీ చేశారు. ఇటీవల పహల్గామ్‌లో ఉగ్రవాదులు దాడి చేసి పర్యాటకులను చంపిన ఘటనను చోడవరం ప్రజలు తీవ్రంగా ఖండించారు. చోడవరం విఘ్నేశ్వరస్వామి ఆలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా నల్లబ్యాడ్జీల ధరించి అంతా ర్యాలీగా నిరసన తెలిపారు. కొత్తూరు జంక్షన్ వద్ద మానవహారం చేసి పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ చోడవరం ప్రతినిధులు ఆర్కే ప్రసాద్, శ్రీనివాసరాజు, పుల్లేటి గణేష్, సాంబ, నడుపూరి దేముడు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం: ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా యూటీఎఫ్, సీఐటీయూ నాయకులు ఎన్టీఆర్ స్టేడియం గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే అమాయకులు ఉగ్రవాదుల చేతిలో బలయ్యారని సీఐటీయూ నాయకుడు అడిగర్ల రాజు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు పి.గాయత్రి, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎల్.గౌరి, యూటీఎఫ్ సీనియర్ నాయకులు ఎం.చిట్టియ్య, కె.ప్రసన్న, కె.వి.సూర్యప్రభ, విజయ్, కె.రామకృష్ణ పాల్గొన్నారు. మొబైల్ షోరూమ్స్ యూనియన్ సభ్యులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి సంతాపం వ్యక్తం చేశారు.

## చోడవరం బార్ అసోసియేషన్ కార్యవర్గం ఏర్పాటు





నూతనంగా ఎన్నికైన కార్యవర్గం ప్రతినిధులు

చోడవరం: న్యాయవాదుల బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవంగా జరిగింది. చోడవరం బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కామిరెడ్డి వెంకట్రావు, చీపురపల్లి సూర్యానారాయణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఎల్లారావు, సంయుక్త కార్యదర్శిగా జీపీఏ సత్యనారాయణ, కోశాధికారిగా పైడిరాజు, స్పోర్ట్స్, కల్చరల్ విభాగం కన్వీనర్‌గా బి.చందు, లైబ్రరీ విభాగం కన్వీనర్‌గా వారాది రాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మహాదేముడు ఎన్నికయ్యారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న కొత్తకోట ఎస్ఐ శ్రీనివాస్

రావికమతం: నేరాల నివారణకు సాంకేతికతను ఉపయోగించి నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయనున్నట్లు కొత్తకోట ఎస్ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు. మండలంలో టి.అర్జాపురం సమీపంలో శుక్రవారం సాయంత్రం వాహనాలు ముమ్మరంగా తనిఖీ చేశారు. వాహనదారులను ఆపి రికార్డులు పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. తదనంతరం డ్రోన్ కెమెరాను ఉపయోగించి చుట్టు పక్కల పరిసరాలను పరిశీలించారు. డ్రోన్ కెమెరా ద్వారా కిలోమీటర్ దూరంలో మద్యం సేవించినా, గంజాయి సాగు, రవాణా, జూదం ఆడినా గుర్తించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే మలేరియా అంతం



దేవరాపల్లిలో మలేరియా అవగాహన ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్యమేఘన



ఎ.కోడూరులో మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న హెల్త్ అసిస్టెంట్ త్రినాథ్, వైద్య సిబ్బంది



కె.జె.పురం పీహెచ్‌సీ వద్ద సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యాధికారి ప్రసాదుపాత్రుడు

దేవరాపల్లి: ప్రజలందరి సమష్టి భాగస్వామ్యంతోనే మలేరియాను అంతం చేయడం సాధ్యపడుతుందని దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఈ.పూజ్య మేఘన అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో కలిసి పీహెచ్‌సీ నుంచి ప్రధాన రోడ్డు వరకు ఈ ర్యాలీ సాగింది. దోమ కాటు పెను ముప్పు అంటూ నినాదాలు చేశారు. స్థానిక మోడల్ కాలనీలో పర్యటించి దోమ కాటుకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. లార్వా వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ఎం.ఆనంద్, హెల్త్ సూపర్‌వైజర్ పుష్పరాజ్, హెచ్‌వీ లక్ష్మీ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

కె.కోటపాడు : లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఎ.కోడూరు సబ్ సెంటర్‌లో సిబ్బందితో కలిసి హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ ర్యాలీ నిర్వహించారు. ఆయుష్ వైద్యాధికారి చంద్రవదన, పీహెచ్ఎన్ ప్రమీలా, హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం సిబ్బందితో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎల్.వి.ఎస్.ఎస్.ప్రసాదుపాత్రుడు ప్రతిజ్ఞ చేయించారు. పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ అధికారి సుజాత, పీహెచ్ఎన్ ఇందిర, ఆరోగ్య పర్యవేక్షకుడు వెంకట్రావు, టీబీ సూపర్‌వైజర్ ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. మాడుగులలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తల సారథ్యంలో మలేరియా నివారణపై ర్యాలీ నిర్వహించారు.

నర్సీపట్నం: మలేరియా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ జ్యోతి అన్నారు. మున్సిపాలిటీ పరిధి థెరిస్సా కాలనీలోని అర్బన్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడారు. వేములపూడి పీహెచ్‌సీలో మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో డాక్టర్ అనుషా, నోడల్ పర్సన్ మల్లిబాబు, హెల్త్ సూపర్‌వైజర్ రుక్మిణి, సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట: ఎస్.కొత్తూరు పంచాయతీ శివారు మునిపల్లి గ్రామంలో వైద్యాధికారి కె.ధనలక్ష్మి ఆధ్వర్యంలో, రోలుగుంటలో వైద్యురాలు శ్రావణి ఆధ్వర్యంలో సిబ్బంది ర్యాలీ చేపటారు. దోమల తెరలు వాడండి –దోమకాట్ల నుంచి రక్షణ పొందండంటూ నినాదాలు చేశారు. ముందుగా మలేరియా వ్యాధిని కనిపెట్టిన డాక్టర్ రోనాల్డ్ చిత్ర పటానికి సిబ్బందితో కలిసి వైద్యులు పూలమాల వేసి నివాళులర్పించారు.

మాకవరపాలెం: అవగాహనతోనే మలేరియా వ్యాధిని నివారించవచ్చని మాకవరపాలెం, బూరుగుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు సీతారామలక్ష్మి, చరిష్మ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

గొలుగొండ: గొలుగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్ ఆధ్వర్యంలో గ్రామంలో మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ పకీర్ నాయుడు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నాతవరం: నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న ఆధ్వర్యంలో ప్రధాన కూడలిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. గునుపూడి పీహెచ్‌సీ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

## సొంతంగా లైన్ల మరమ్మతులు చేపట్టొద్దు

- విద్యుత్ సమస్యల పరిష్కారానికి సిబ్బందిని సంప్రదించాలి
- ఏపీఈపీడీసీఎల్ ఏఈ చంద్రశేఖర్

కె.కోటపాడు : విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు కలిగినా వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియజేయాలని కె.కోటపాడు ఏపీఈపీడీసీఎల్ ఏఈ చంద్రశేఖర్ సూచించారు. కె.కోటపాడులో శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిన సమయంలో విద్యుత్ శాఖ సిబ్బందికి తెలియజేయకుండా సొంతంగా మరమ్మతులు చేపట్టడం ప్రమాదకరమన్నారు. 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు 24 గంటల పాటు ఫిర్యాదు చేసుకోవచ్చునని తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఇంటి నిర్మాణాలు చేపట్టరాదన్నారు. ఇంటి నిర్మాణాలకు విద్యుత్ లైన్లు అడ్డంగా ఉంటే సిబ్బందిని సంప్రదించి షిఫ్టింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇతర విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 94408 12541 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.